క్లుప్తంగా

చురుగ్గా ప్రధాన కాలువ మరమ్మతులు



ఇసుకతోట పెట్రోల్ బంక్ వద్ద పొక్లెయిన్‌తో గొట్టాలు తొలగిస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం: ఇసుకతోట ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద ప్రధాన కాలువ మరమ్మతు పనులు చురుగ్గా చేపడుతున్నారు. చిన్నపాటి వర్షానికే ఈ కాలువ పొంగిపోవడానికి కారణం పెట్రోల్ బంక్‌కు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన గొట్టాలు మూసుకుపోవడమేనని ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. ఆ గొట్టాలను శుక్రవారం పొక్లెయిన్‌తో తొలగించారు. పెట్రోల్ బంక్ ముందు, రోడ్డు పక్కనే కాలువపై పూర్తిగా సిమెంట్ శ్లాబ్ వేయడానికి యుద్ధప్రాతిపదికన పనులు జరుపుతున్నారు. భవిష్యత్‌లో మరోసారి మురుగు నీటి ముప్పు వాటిల్లకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని అధికారులు పేర్కొంటున్నారు. కాలువ మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు.

ఆట పరికరాలకు రంగులు



కంబాలకొండ పార్కులో రంగులు వేసిన పిల్లల ఆట పరికరాలు

ఆరిలోవ: జాతీయ రహదారి పక్కన కంబాలకొండ ఎకో టూరిజం పార్కులోని పిల్లల ఆట పరికరాలకు కొత్తదనం వచ్చింది. ఈ పార్కులో ఇటీవల అభివృద్ధి పనులు చేపట్టారు. ఉడ్ డెక్‌లు, కాటేజీల పునర్నిర్మాణం, క్యాంటీన్ ఆధునికీకరణ, విశ్రాంతి షెల్టర్లు, యోగా సెంటర్ తదితర వాటిని నిర్మించారు. పిల్లల ఆట స్థలంలో తుప్పుపట్టిన పరికరాలకు రంగులు వేశారు. వాటి చుట్టూ రెండడుగుల రక్షణ గోడ నిర్మించి దానిని రంగులతో ముస్తాబు చేశారు. ఇక్కడ ఊయలలు, జారుడు బల్లలు, తూగుడు బల్లలు తదితర ఆట పరికరాలకు వివిధ రంగులు వేయడంతో.. అవి పిల్లలను ఆకర్షిస్తున్నాయి.

చలివేంద్రం ఏర్పాటు



కొత్త వెంకోజీపాలెం బస్టాప్ వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం సిగ్నల్ పాయింట్ బస్టాప్ వద్ద శ్రీ సమర్థ సద్గురు సాయినాథ్ దేవాలయం అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు, వాహన చోదకులకు మజ్జిగ పంపిణీ చేశారు. రెండు నెలల పాటు చలివేంద్రాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కాళ్ల శంకర్, కామేశ్వరరావు, కాళ్ల ఆనంద్, ఆడారి సూరిబాబు, ఇతర సభ్యులు, గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

ఎంవీపీకాలనీ: ఉషోదయ కూడలిలోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన కండిపల్లి హేమంత్ అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎంవీపీ క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా.. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఉషోదయ కూడలి శెట్టిబలిజ వీధికి చెందిన ఓ మహిళ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లింది. రాత్రి 11 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి డోర్ తాళం విరగ్గొట్టి ఉంది. రూ.15 వేల నగదు, 10 గ్రాముల బంగారం పోయినట్లు గుర్తించి ఎంవీపీ పోలీసులకు సమాచారమిచ్చింది. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేయగా.. అదే ఇంటి మేడపై నివసిస్తున్న హేమంత్ వీటిని దొంగిలించినట్లు గుర్తించారు. బంగారంతోపాటు రూ.12 వేల నగదును రికవరీ చేసి శుక్రవారం నిందితుడిని కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్ విధించింది.

కేజీహెచ్‌లో జనన ధ్రువీకరణ కేంద్రం ప్రారంభం

మహారాణిపేట: కేజీహెచ్ గైనకాలజీ విభాగంలో శుక్రవారం జనన ధ్రువీకరణ కేంద్రాన్ని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేజీహెచ్‌లో కేవలం 24 గంటల్లోనే జనన ధ్రువీకరణ పత్రం అందజేయవచ్చన్నారు. తల్లులు తమ ఆధార్ కార్డుతో వచ్చిన వెంటనే ఈ ప్రక్రియ పూర్తవుతుందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్ కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

ముంపు భయం



రజక వీధి ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడికలు



ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపైకి చేరిన మురుగు నీరు



పూడికలతో నిండిన ప్రధాన కాలువ



కాలువలో మూసుకుపోయిన గొట్టాలు

- 16వ వార్డు రజక వీధిలో కాలువలకు అడ్డంగా కట్టడాలు
- వర్షానికి పొంగిపొర్లుతున్న మురుగు నీరు
- అవస్థలు పడుతున్న స్థానికులు
- అధికారులు పట్టించుకోవాలని విజ్ఞప్తి

మద్దిలపాలెం: జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అనాలోచిత కట్టడాలతో ప్రజల్లో ముంపు భయం ఏర్పడింది. చినుకు పడితే చాలు వీధి కాలువల్లోని మురుగు పొంగిపొర్లుతోంది. మురుగు నీటి ప్రవాహానికి ఎటువంటి అడ్డంకి లేకుండా ప్రధాన కాలువల నిర్మాణం చేపట్టాలి. అలా కాకుండా ఇష్టానుసారంగా వాటిని నిర్మించారు. దీంతో చిన్నపాటి వాన కురిసినా కాలువల్లోని మురుగు, వ్యర్థాలు రోడ్డెక్కి ప్రవహిస్తున్నాయి. దీనికి నిదర్శనమే జీవీఎంసీ 16వ వార్డు రజక వీధిలో నిర్మించిన ప్రధాన కాలువ. ఇది రజక వీధి మధ్య నుంచి ప్రవహిస్తోంది. ఈ కాలువను ఆనుకుని ఒకవైపు భవంతులు.. మరోవైపు రజక వీధి సామాజిక భవనం నిర్మించారు. దీంతో ఈ కాలువలో పూడికలు తీయడానికి వీలు లేని పరిస్థితి ఏర్పడింది. ఈ కాలువ నిత్యం మురుగు నీటితో నిండి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ కాలువ నీటి ప్రవాహానికి వీలు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

మూసుకుపోయిన కాలువ గొట్టాలు

ఈ కాలువ నుంచి నేరుగా రజక వీధి మీదుగా ప్రవహిస్తున్న గెడ్డకు అనుసంధానం చేస్తూ భూగర్భ డ్రైనేజీలో భాగంగా పైపులు ఏర్పాటు చేశారు. వీటిపై పలు కట్టడాలు చేపట్టారు. ఈ పైపుల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో అవి పూర్తిగా మూసుకుపోయాయి. మురుగు నీటి ప్రవాహానికి దారి లేకపోవడంతో కాలువలో వ్యర్థాలు నిల్వ ఉండిపోయాయి.

చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి మురుగు

చిన్నపాటి వర్షం పడినా ఈ కాలువలోని మురుగు నీరు పొంగిపొర్లుతోంది. రజక వీధి వెనుక భాగంలోని రహదారిపైకి మురుగు నీరు చేరుతోంది. మూడు రోజుల కిందట కురిసినా వర్షానికి ఈ ప్రాంతమంతా మురుగు నీటితో నిండిపోయింది. దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. ఆ దారిగుండా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. మురుగు, వ్యర్థాలు, బురద రోడ్లుపైకి చేరడంతో రాకపోకల సమయంలో స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. పారిశుధ్య సిబ్బంది తాత్కాలికంగా మురుగు, వ్యర్థాలను తొలగించారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రధాన కాలువను గెడ్డకు అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన గొట్టాలకు మరమ్మతులు చేయాలని రజక వీధి వాసులు కోరుతున్నారు. గొట్టాలను పూర్తిగా తొలగించి కాలువ నీటి ప్రవాహానికి మార్గం ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. వర్షాల సమయంలో మురుగు నీటి ముంపుతో సహవాసం చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

దివ్యాంగ చిన్నారుల్లో విభిన్న నైపుణ్యాలు పెంపొందించాలి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆచార్య నాగరాజకుమారి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈ, ఏయూ విద్యా విభాగంతో సంయుక్తంగా జాతీయ విద్యా విధానం-2020, సహిత విద్యలో నూతన బోధనా పద్ధతులు అనే అంశంపై రెండు రోజుల పునరావాస విద్యా కార్యక్రమాన్ని(అధ్యాపకుల పునఃశ్చరణ తరగతులు) శుక్రవారం ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నాగరాజకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారుల్లో విభిన్న నైపుణ్యాలను పెంపొందించే దిశగా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. రెండు రోజుల శిక్షణ తరగతుల్లో నిపుణులు అందించే సూచనలను ఆచరణలో చూపుతూ తమ బోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సదస్సు కో ఆర్డినేటర్, ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ చిన్నారుల కోసం వారిలో అవసరమైన బహుళ నైపుణ్యాలను పెంపొందించడానికి పలు సాంకేతిక ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని వినియోగించి తమ భావాలను తెలిపేలా విద్యార్థులకు శిక్షణ అందించాలని అధ్యాపకులకు సూచించారు. రీ హాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ-న్యూఢిల్లీ) పూర్వ సభ్యులు ఆర్.రంగనాథన్, డాక్టర్ ఎం.ప్రభాకర్‌రావు, డాక్టర్ మదన్ మోహన్, డాక్టర్ అన్నపూర్ణ తదితరులు అవగాహన కల్పించారు. ఆర్‌సీఐ సభ్యత్వం కలిగిన 50 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణ కోసం హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యా విభాగం, ఐఏఎస్ఈ అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా జాతీయ రహదారి అంచు



విశాఖ వ్యాలీ స్కూల్ - కంబాలకొండ మధ్యలో కోతకు గురైన హైవే

ఆరిలోవ: జాతీయ రహదారి అంచు కోతకు గురై పలుచోట్ల ప్రమాదకరంగా మారింది. విశాఖ వ్యాలీ స్కూల్ కూడలి నుంచి కంబాలకొండ, జూ పార్కు దాటేంత వరకు రహదారి అంచున మట్టి కరిగిపోయింది. వర్షాలు కురిసినప్పుడు వరద నీరు రోడ్డు అంచున ప్రవహించడంతో ఇక్కడ కోతకు గురైంది. ఇది తారు రోడ్డు కంటే అడుగు లోతులో ఉండటంతో కాలువ మాదిరిగా కనిపిస్తోంది. రోడ్డుపై వెళ్తున్న వాహన చోదకులు ఇక్కడ అదుపు తప్పి పడిపోతున్నారు. వాహనాల రద్దీ సమయంలో అంచులకు వెళ్తున్న వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఎక్కువగా ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో తారు రోడ్డు ఎత్తు వరకు మట్టి వేసి పూడ్చితే ప్రమాదాల నియంత్రించవచ్చని వాహన చోదకులు సూచిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు అంచులను మట్టితో పూడ్చాలని కోరుతున్నారు.

హోరాహోరీగా 'వాల్తేరు క్రీడామేళా'

విశాఖ స్పోర్ట్స్: ఈకోర్సా వాల్తేరు క్రీడామేళాలో భాగంగా క్యారమ్స్ పోటీల్లో పురుషులు, మహిళల విభాగాలు రెండింటిలోనూ ఈఎల్‌ఎస్‌తో సీనియర్ డీఈఈ విభాగం జట్లు ఫైనల్స్‌లో తలపడనున్నాయి. శుక్రవారం జరిగిన పురుషుల సెమీఫైనల్స్ పోటీల్లో ఎస్టీ జట్టుపై ఈఎల్‌ఎస్, కమర్షియల్ జట్టుపై సీనియర్ డీఈఈ జట్లు విజయం సాధించాయి. క్రికెట్ పోటీల్లో సీడబ్ల్యూ జట్టు చేసిన 118 పరుగులకు ప్రతిగా డీఎల్‌ఎస్ జట్టు మరో ఆరు వికెట్లు ఉండగానే విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఎలక్ట్రికల్ జట్టు చేసిన 177 పరుగులకు ప్రతిగా పర్సనల్ విభాగపు జట్టు 78 పరుగులకే ఆలౌటై పరాజయం పాలైంది. ఇంజినీరింగ్ జట్టు 137 పరుగులకు ప్రతిగా డీఎల్‌ఎస్ పద్ధతిలో ఓవర్లను కుదించగా, ఎలక్ట్రికల్ టీఆర్‌డీ జట్టు 70 పరుగులే చేసి ఓటమి చెందింది.

విమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు



విమ్స్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

కేజీహెచ్‌కు ప్రత్యామ్నాయం: కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. విమ్స్ వార్షికోత్సవాన్ని శుక్రవారం విమ్స్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. విమ్స్ నర్సింగ్, పరిపాలనా తదితర విభాగాలకు ఆటల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలకు సేవలందించడంలో కేజీహెచ్‌కు ప్రత్యామ్నాయంగా విమ్స్ నిలుస్తుందన్నారు. ఇక్కడ ఓపీ గణనీయంగా పెరుగుతోందని, 19 విభాగాల నుంచి రోగులకు వైద్య సేవలు అందుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాష్ట్రంలోనే మొదటిసారిగా కాలేయం మార్పిడి విమ్స్‌లో జరగడం విశేషమన్నారు. ఇలాంటి విశేషాలు మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు ఆస్పత్రి అభివృద్ధితోపాటు జీవన్‌ధాన్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. డైరెక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ విమ్స్‌లో అందుతున్న వైద్య సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ యూహెచ్‌ఎస్ రిటైర్డ్ వీసీ డాక్టర్ టి.రవిరాజు, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యారాణి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, కేజీహెచ్ విశ్రాంతి సూపరింటెండెంట్ డాక్టర్ జి.అర్జున, ఐటీసీఎల్ ఛీఫ్ జనరల్ మేనేజర్ ఎ.ఆర్.వి.బద్రీనాథ్, విమ్స్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతీరావు పూలే సేవలు చిరస్మరణీయం



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు



ఏయూలో జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ రాజశేఖర్, ఆచార్యులు



జ్యోతీరావు పూలే చిత్రపటానికి నమస్కరిస్తున్న ఎన్‌ఎంయూఏ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

ఎంవీపీకాలనీ: సమ సమాజ స్థాపనకు మహాత్మా జ్యోతీరావు పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఎంవీపీ కాలనీ గిరిజన భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాలను అక్కున చేర్చుకున్న జ్యోతిబా పూలే వారి అభ్యున్నతి, సమానత్వ సాధనకు, కుల వ్యవస్థ, అంటరానితనం నిర్మూలనకు జీవితాన్ని ధారపోశారన్నారు. బాలికల చదువుకు బాటలు వేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. పూలే స్ఫూర్తితో యువత చదువుతోపాటు సమాజ సేవను అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సొనాయి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూలే జీవితం యువతకు ఆదర్శం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మహాత్మా జ్యోతీరావ్ పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ప్రాంగణంలోని పూలే విగ్రహానికి వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, ఆచార్యులతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతీరావ్ పూలే జీవితం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు, మహిళా విద్య, అభ్యున్నతికి పూలే దంపతులు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆచార్య గిరిజా శంకర్, ఆచార్య నాగరాజకుమారి, వర్సిటీ ఎస్సీ, ఎస్టీ బీసీ టీచర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య టి.షారోన్ రాజ్, పలువురు ఆచార్యులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడికి ఘన నివాళి

మద్దిలపాలెం: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్‌ఎంయూఏ) ఆధ్వర్యంలో మద్దిలపాలెంలోని రామ్మోహనరావు భవనంలో జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే జీవితం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ నాయకులు, ఉద్యోగులు, గ్యారేజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కంబాలకొండ నర్సరీలో సిద్ధమవుతున్న నారు



నర్సరీలో సిద్ధం చేసిన మొక్కలు



నారు సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు ఎదురుగా అటవీ శాఖకు చెందిన కంబాలకొండ నర్సరీలో వివిధ మొక్కల కోసం నారు సిద్ధం చేస్తున్నారు. అటవీ శాఖ ఇక్కడ అనేక రకాల మొక్కలను ఉత్పత్తి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు, అడవుల్లోని ఖాళీ స్థలాలు, బయట ప్రాంతాల్లో అటవీ శాఖకు చెందిన ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడానికి ఇక్కడ నుంచే పంపిణీ చేస్తుంటారు. వేసవి కావడంతో ఇక్కడ మొక్కలు నిల్వ ప్రస్తుతం బాగా తగ్గిపోయింది. రానున్న తొలకరి(వర్షా కాలం)కి మొక్కలు నిల్వ ఉంచడానికి కొద్ది రోజులుగా నారు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ ఆకులు, పేడ, చెత్తతో తయారు చేసిన ఎరువు నింపిన చిన్న బ్యాగుల్లో నారు పోసి మొక్కలు ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం కంబాలకొండ నర్సరీలో రోజ్ వుడ్, సొగసుల చెట్లు, వేప, నేరేడు, గుమ్మడి చెట్టు, బాదం, కానుగ, ఎర్ర చందనం, అంకుడు, అశోక్, తెల్లమద్ది తదితర రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

అయ్యప్పకు ఉత్తర నక్షత్ర పూజలు



అయ్యప్పకు పూజలు చేస్తున్న భక్తులు



కొత్త వెంకోజీపాలెం ఆలయంలో అయ్యప్ప స్వామి



చినగదిలి ఆలయంలో పుష్పాలంకరణలో అయ్యప్ప స్వామి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిర సముదాయంలో అయ్యప్ప స్వామికి శుక్రవారం ఉత్తర నక్షత్ర పూజలు నిర్వహించారు. గుడిలో అయ్యప్ప స్వామిని అర్చకులు గులాబీలు, చామంతి, మందార తదితర రకాల పూలతో అలంకరించారు. అర్చకుడు నగేష్ శర్మ, ప్రభస్ అయ్యప్ప భక్తులతో అష్టోత్తర పూజా కార్యక్రమాలు చేయించారు. పంచామృత సుగంధ ద్రవ్యాభిషేకాలు జరిపారు. ఈ పూజలతో పాటు ఈ నెల 14న అయ్యప్ప స్వామి పుట్టినరోజు కార్యక్రమాలు కూడా ఇక్కడ నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు.

అయ్యప్ప స్వామి జన్మదినోత్సవ పూజలు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయ సముదాయంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం ప్రసాద వితరణ, నారాయణ సేవ కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, బాల భాస్కర శర్మలు భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక అభిషేకాలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారి తిరువీధి ఉత్సవం, రాత్రి పవళింపు సేవ, హరివరాసనంతో కార్యక్రమాలను ముగించారు. గ్రామ సేవా సంఘం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సరోగసీ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: సరోగసీ, ఏఆర్‌టీ (సహాయక పునరుత్పత్తి సాంకేతిక) కోసం చేసుకున్న దరఖాస్తులను తనిఖీ చేయడంతో పాటు అక్కడ మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏఆర్‌టీ, సరోగసీ చట్టంపై జరిగిన సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. పలు ఆస్పత్రులు సరోగసీ కోసం దరఖాస్తు చేసుకున్నాయని, వీటిని పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఏఆర్‌టీ లెవల్-1, నోవా ఐవీఎఫ్ కేంద్రం ఏఆర్‌టీ లెవల్-2, ఐశ్వర్య ఫెర్టిలిటీ కేంద్రం ఏఆర్‌టీ లెవల్-2 కోసం దరఖాస్తు చేసుకున్నాయని వివరించారు. కేజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, పలు విభాగాల అధికారులు ఎల్.వి.రమణి, బి.నాగేశ్వరరావు, నారాయణరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా పోటీలకు జిల్లా వాసి ఎంపిక

సాక్షి, అమరావతి: జాతీయ స్థాయి అండర్-17 'సెపక్ తక్రా'పోటీలకు ఏపీ జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భాను మూర్తిరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బాలుర జట్టుకు విశాఖ జిల్లా నుంచి టి.జశ్వంత్ ఎంపికయ్యాడు. ఈ నెల 15 నుంచి 21 వరకు మణిపూర్‌లోని ఇంఫాల్ శాయ్ సెంటర్లో పోటీలు జరగనున్నాయి. ఈ జట్లకు కోచ్‌గా ఎస్.రమేష్ (ఎస్టీఆర్), బాలికల జట్టు మేనేజర్‌గా ఎం.సంతోషి కుమారి (కర్నూలు), బాయ్స్ టీమ్ మేనేజర్ డి.సుంకర రావు (కర్నూలు) వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సమగ్ర శిక్షా ఎస్పీడీ అభినందిస్తూ.. విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.